
ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
ఆదివారం 27 అక్టోబరు 2024 www.prajaaswaramdaily.com 2pm

# వాళ్లందరినీ అరెస్టు చేయాలి: బండి సంజయ్



హైదరాబాద్, ప్రజాస్వరం: కేటీఆర్ బావమరిది ఫామ్‌హౌస్‌లోనే రేవ్ పార్టీలా? బడా నేతలతో సహా రేవ్‌పార్టీలో ఉన్న వాళ్లందరినీ అరెస్టు చేయాలి అని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. "రాజ్ పాకాల ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్‌పై కేటీఆర్ ఇప్పుడేమంటారో. డ్రగ్స్ తీసుకుంటూ అడ్డంగా దొరికినా బుకాయిస్తాడేమో? కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే సమగ్ర విచారణ జరపాలి. సీసీ ఫుటేజీ సహా ఆధారాలు ధ్వంసం కాకుండా చూడాలి అని బండి సంజయ్ డిమాండ్ చేశారు. జన్వాడలో ఫాంహౌస్‌పై సైబరాబాద్ ఎస్‌వోటీ పోలీసులు దాడులు చేశారు. ఇక్కడి రిజర్వ్ కాలనీలో ఉన్న రాజ్ పాకాల ఫాంహౌస్‌లో శనివారం రాత్రి పార్టీ నిర్వహించారు. భారీ శబ్దాలతో ఈవెంట్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. పార్టీలో పాల్గొన్న 24 మందికి డ్రగ్స్ పరీక్ష నిర్వహించారు. ఇందులో ఓ వ్యక్తికి పాజిటివ్‌గా నిర్ధరణ అయింది. కొకైన్ తీసుకున్నట్లు పరీక్షలో తేలడంతో కేసు నమోదు చేశారు. విదేశీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.



రాజ్ పాకాల ఫామ్‌హౌస్‌పై అర్ధరాత్రి

# ఎస్‌ఓటీ దాడులు

## ఇది కేటీఆర్ బావమరిదిదిగా ప్రచారం - పెద్దశబ్దాలతో రేవ్ పార్టీ

### పాల్గొన్న 42 మంది.. అందులో 12 మంది మహిళలు

### ఒక వ్యక్తి కొకైన్ తీసుకున్నట్లు గుర్తింపు.. ఎన్డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు

హైదరాబాద్, ప్రజాస్వరం : హైదరాబాద్ సమీపంలోని జన్వాడ ఫామ్‌హౌస్‌పై గత రాత్రి సైబరాబాద్ ఎస్‌వోటీ పోలీసులు దాడులు చేశారు. రిజర్వ్ కాలనీలో ఉన్న రాజ్ పాకాల ఫాంహౌస్‌లో పెద్ద శబ్దాలతో పార్టీ నిర్వహిస్తున్నట్టు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేశారు. తనిఖీలు నిర్వహించి పార్టీలో పాల్గొన్న వారికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించారు. పార్టీలో 14 మంది మహిళలు సహా 42 మంది పాల్గొన్నట్టు గుర్తించారు. పరీక్షల్లో ఓ వ్యక్తి కొకైన్ తీసుకున్నట్టు నిర్ధారణ కావడంతో కేసు నమోదు చేశారు. ఘటనా స్థలం నుంచి విదేశీ మద్యం, డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. రాజ్ పాకాల ఫామ్‌హౌస్‌లో జరిగిన పార్టీపై డ్రగ్స్ ఎన్డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. కాగా, రాజ్ పాకాల గెస్ట్‌హౌస్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బావమరిదిగా చెబుతున్నారు.

## రేవంత్ రెడ్డి, కేటీఆర్ రాజీపడినట్లు ప్రచారం : బీజేపీ ఎంపీ రఘునందన్



హైదరాబాద్, ప్రజాస్వరం : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి జన్వాడలోని రాజ్ పాకాల ఫామ్ హౌస్ యజమానితో కుమ్మక్కు కాకపోతే... డీజీపీ ఈరోజు మధ్యాహ్నమే ప్రెస్‌మీట్ పెట్టి ఎస్‌వోటీ పోలీసులు రైడ్ సమయంలో ఫామ్ హౌస్ లోపల, చుట్టూ ఉన్న సీసీటీవీ ఫుటేజీ విడుదల చేయాలని బీజేపీ ఎంపీ రఘు నందన్ రావు డిమాండ్ చేశారు. ఇటీవలి కాలంలో జన్వాడ ఫామ్ హౌస్‌పై సీఎం ఎలాంటి చర్యలు తీసుకున్నట్లుగా కనిపించడం లేదన్నారు. రేవంత్ రెడ్డి, కేటీఆర్ రాజీపడినట్లుగా ప్రచారం సాగుతోందన్నారు. అక్కడ జరిగింది రేవ్ పార్టీయా? డ్రగ్ పార్టీయా? ఫారిన్ లిక్కర్ ఉందా? తెలియాల్సి ఉందన్నారు. రాజ్ పాకాలకు సంబంధించిన ఫామ్ హౌస్ ఫుటేజీని బయట పెట్టాలన్నారు. ఆలస్యం అయితే కనుక ఎడిటింగ్ కార్యక్రమాలు మొదలవుతాయని అనుమానం వ్యక్తం చేశారు. ముఖ్య నాయకులు, వారి పిల్లలను బయటకు పంపించి తర్వాత కొంతమంది అమాయకులను అరెస్ట్ చేసినట్లుగా కనిపిస్తోందన్నారు. డ్రగ్స్ పార్టీ వ్యవహారంపై సిట్ దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు. ఓ వైపు డ్రగ్స్ రహిత తెలంగాణగా చేస్తామని ప్రభుత్వం ప్రకటనలు చేస్తోందని, కానీ వీకెండ్ వచ్చిందంటే హైదరాబాద్ చుట్టూ రేవ్ పార్టీలు... రావుల పార్టీలు జరుగుతున్నాయని ఎద్దేవా చేశారు. రాజులు, యువ రాజులు కూర్చొని విదేశీ మాదకద్రవ్యాలతో పాటు కొకైన్ వంటి డ్రగ్స్ తీసుకున్నారన్నారు.

## బాంద్రా రైల్వే స్టేషన్‌లో తొక్కిసలాట

- 9 మందికి తీవ్ర గాయాలు, ఇద్దరి పరిస్థితి విషమం
- బాంద్రా-గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫాం మీదికి రాగానే..
- క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించిన పోలీసులు

**ముంబయి** : దీపావళి పండుగ రద్దీ నేపథ్యంలో ముంబైలోని బాంద్రా రైల్వే స్టేషన్‌లో తొక్కిసలాట జరిగింది. తెల్లవారుజామున 5.56 గంటలకు ప్లాట్‌ఫాం నంబర్ 1లో జరిగిన ఈ ఘటనలో 9 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఇందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. బాంద్రా–గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫాం మీదికి రాగానే ప్రయాణికులు ఒక్కసారిగా రైలు ఎక్కేందుకు ప్రయత్నించడంతో ఈ ఘటన జరిగింది. క్షతగాత్రులను బాంద్రా ఆసుపత్రికి తరలించారు. పండుగ రద్దీ కారణంగా ఈ ఘటన చోటుచేసుకున్నట్టు బృహన్ ముంబై మునిసిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) పేర్కొంది. తొక్కిసలాట కారణంగా గాయపడిన వారి రక్తపు మరకలు ప్లాట్‌ఫాం నిండా కనిపించాయి. కొందరు ప్రయాణికులు స్పృహ తప్పి ప్లాట్‌ఫాంపై పడిపోయారు. రైల్వే పోలీసులు సకాలంలో స్పందించి బాధితులను ఆసుపత్రికి తరలించారు.





...లాట కారణంగా గాయపడిన వారి రక్తపు మరకలు

## పంజాబ్‌లో 105 కేజీల డ్రగ్స్ సీజ్

**చండీగఢ్:** పంజాబ్‌లో 105 కేజీల డ్రగ్స్‌ను పోలీసులు సీజ్ చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో దీని విలువ వందల కోట్లలో ఉంటుందని అంచనా. స్మగ్లర్ల నుంచి పెద్ద రబ్బరు ట్యూబ్‌లు, తుపాకులు, 105 కేజీల హెరాయిన్, 31.93 కేజీల కెఫిన్ అన్‌హైడ్రస్, 17 కేజీల డీఎంఆర్ లను స్వాధీనం చేసుకున్నామని డీజీపీ గౌరవ్ పేర్కొన్నారు. సముద్ర మార్గంలో పెద్ద మొత్తంలో డ్రగ్స్‌ను తరలిస్తున్నట్లు ఇంటెలిజన్స్ వర్గాలకు సమాచారం అందడంతో.. పోలీసులు ఆపరేషన్ నిర్వహించారని తెలిపారు. పాకిస్థాన్ నుంచి జలమార్గాల్లో మాదక ద్రవ్యాలను సరఫరా చేస్తుండగా స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. డ్రగ్ స్మగ్లర్‌తో సంబంధం ఉన్న నవజ్యోత్ సింగ్, లవ్‌ప్రీత్ కుమార్‌లను అదుపులోకి తీసుకున్నామని వెల్లడించారు. ఇందులో ప్రమేయం ఉన్న మరింత మంది నిందితుల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామన్నారు.

## ఆ వార్తలు చూసి షాకయ్యా

**బాలీవుడ్ నటి కాజోల్**

**ముంబయి:** బాలీవుడ్ యాక్టరస్ కాజోల్ కీలక పాత్రలో నటించిన సరికొత్త చిత్రం 'దో పత్తి'. శుక్రవారం ఇది నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదలై మంచి టాక్ సొంతం చేసుకుంది. కృతిసనన్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రమే 'దో పత్తి'. ఇందులో ఆమె ద్విపాత్రాభినయం చేశారు. మిస్టరీ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందిన చిత్రమిది. శశాంక చతుర్వేది దర్శకత్వం వహించారు. కవలలైన అక్కా చెల్లెళ్ల రహస్యాలను వెలికితీసే పోలీసు అధికారి పాత్రలో కాజోల్ నటించారు. 'బ్లూ బటర్ ఫ్లై ఫిల్మ్స్' పతాకంపై కృతి నిర్మించిన తొలి చిత్రమిది. షహీర్ షేక్, తన్వీ అజ్మీ, బ్రిజేంద్ర కాలా కీలక పాత్రలు పోషించారు. నెట్‌ఫ్లిక్స్ వేదికగా అక్టోబర్ 25న దీనిని విడుదల చేశారు. కాగా, ప్రమోషన్స్‌లో భాగంగా చిత్రబృందం ది కపిల్ శర్మ షోలో సందడి చేసింది. ఈ సందర్భంగా కాజోల్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. తాను చనిపోయినట్లు చాలా సందర్భాల్లో వార్తలు వచ్చాయని వాటిని చూసి షాకయ్యానని చెప్పారు.

మీ గురించి మీరు చదివిన వింత వార్తలు ఏమైనా ఉన్నాయా? అని ప్రశ్నించగా "చాలా ఉన్నాయి. ఏకంగా నేను చనిపోయినట్లు వార్తలు వచ్చాయి. వాటిని చూసి షాకయ్యా. ఇలా ఎన్నోసార్లు జరిగింది. దాదాపు ఐదేళ్లకొకసారి ఇలాంటివి వస్తుంటాయి. ఇంటర్నెట్ లేని రోజుల్లో గుర్తు తెలియని వ్యక్తి మా అమ్మకు ఫోన్ చేసి.. విమాన ప్రమాదంలో నేను చనిపోయానని చెప్పాడు. ఇంట్లోవాళ్లు కంగారుపడ్డారు. ఇటీవల యూట్యూబ్‌లో నేను మృతి చెందినట్లు వార్తలు కనిపించాయి. నా గురించి ఎలాంటి వార్తలు వచ్చాయి? ఎవరు ఎలా మాట్లాడుకుంటున్నారు? అని గూగుల్ చేయను. నాపై ఏదైనా సంచలన వార్తలు వస్తే.. స్నేహితులు నాకు పంపిస్తుంటారు. వాటిని చదివినప్పుడు ఇలా ఎలా రాస్తారు? అనిపిస్తుంది అని కాజోల్ తెలిపారు.



## ఇరుముడితో విమానంలో ప్రయాణం

**అయ్యప్పస్వాములకు గుడ్ న్యూస్**



**అమరావతి** : అయ్యప్ప స్వాములకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు గుడ్ న్యూస్ చెప్పారు. ఇవాళ ఆయన విశాఖ – విజయవాడ మధ్య ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, ఇండిగో విమాన సర్వీసులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అయ్యప్ప స్వాములు ఇక నుంచి ఇరుముడితో ఫ్లైట్‌లో ప్రయాణించేందుకు అనుమతిస్తున్నట్లు ప్రకటించారు. జనవరి 20 వరకు సివిల్ ఏవియేషన్ ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారణ భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. త్వరలోనే భోగాపురంలో ఏవియేషన్ యూనివర్సిటీని ప్రారంభిస్తామని తెలిపారు. నిర్ణీత గడువు కంటే ముందే ఎయిర్‌పోర్టును ప్రారంభిస్తామని అన్నారు. త్వరలోనే ఇంటర్‌నేషనల్ కార్గో సెంటర్ అందుబాటులోకి రానుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు.

## అప్పుడు మస్క్‌కు వర్క్ పర్మిట్ లేదు

**వాషింగ్టన్:** మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు మద్దతు తెలుపుతున్న ఎలాన్ మస్క్ గురించి వాషింగ్టన్ పోస్ట్ కథనంలో వెల్లడించింది. దక్షిణాఫ్రికాకు చెందిన ఎలాన్ మస్క్ 1995లో కాలిఫోర్నియాలోని పాలో ఆల్టోకి వచ్చారు. అయితే ఆయన ఏ విశ్వవిద్యాలయంలో నమోదు చేసుకోకుండా జిప్ 2 అనే సాఫ్టవేర్ కంపెనీని అభివృద్ధి చేశారు. 1999లో ఆ కంపెనీని సుమారు 300 మిలియన్ డాలర్లకు విక్రయించారు. అమెరికాలో వర్క్ పర్మిట్ పొందాలంటే ఆ వ్యక్తి గ్రాడ్యుయేషన్ కోర్సులో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. కానీ, అలా చేయకుండానే కొంత కాలం ఉన్నట్లు ఆ నివేదికలో వెల్లడించింది. 1997లో మస్క్ వర్క్ పర్మిట్ పొందినట్లు ఆయన మాజీ సహచరులు వెల్లడించినట్లు సమాచారం. 2020లో మస్క్ ఓ పోడ్‌కాస్ట్‌లో దీనిపై స్పందించినట్లు తెలుస్తోంది. తాను చట్టబద్ధంగానే ఉన్నానని ఆయన వెల్లడించినట్లు కథనంలో పేర్కొంది.



### తాజా ప్రచారంపై స్పందించని మాస్క్

అయితే తాజా ప్రచారంపై ఆయన స్పందించలేదు. నవంబరు 5న అమెరికాలో జరగనున్న అధ్యక్ష ఎన్నికల్లో మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు మస్క్ మద్దతు పలికారు. ఈ నేపథ్యంలో ఆయన అక్రమ వలసదారులపై పలుమార్లు కఠిన వ్యాఖ్యలు చేశారు. మరికొన్ని రోజుల్లో అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో అక్రమ వలసదారుల అంశం కీలకంగా మారింది.